ముడసర్లోవకు.. రక్షణ కవచం



ముడసర్లోవ రిజర్వాయర్ వెనుక భూముల చుట్టూ నిర్మించిన రక్షణ గోడ

నియోజకవర్గం పరిధి ఆరిలోవలో జీవీఎంసీ భూములు కాపాడుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టారు. జీవీఎంసీకి చెందిన భూములు ఎక్కడ ఉంటే అక్కడ రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ముడసర్లోవలో ఉన్న భూముల చుట్టూ ఎనిమిది నెలల క్రితం రక్షణ గోడ నిర్మించారు. ఇక్కడ భూములు ఆక్రమణకు గురి కాకుండా రూ.కోట్ల నిధులు ఖర్చు చేశారు. ఇక్కడ రక్షణ గోడలు నిర్మించడంతో రోడ్లకు సైతం కొత్తదనం చేకూరింది.





ముడసర్లోవ రిజర్వాయర్ చుట్టూ ఏర్పాటు చేసిన రక్షణ గోడ

ఆరిలోవ : గతంలో ముడసర్లోవ చుట్టుపక్కల ఉండే జీవీఎంసీ భూములు ఆక్రమణకు గురయ్యాయి. మరికొందరు ఆక్రమణకు సిద్ధపడ్డారు. వారి ప్రయత్నాలకు అధికారులు గండికొట్టారు. ముడసర్లోవతో పాటు జీవీఎంసీకి చెందిన అన్ని భూముల చుట్టూ రక్షణ గోడలు నిర్మించారు. దీంతో ఆక్రమణదారుల ఆటలు సాగలేదు. దీంతో ఇక్కడ జీవీఎంసీ భూములకు పటిష్టమైన రక్షణ కవచం ఏర్పడిందని స్థానికులు భావిస్తున్నారు.

రూ. 9.90 కోట్ల ఖర్చు..

నియోజకవర్గం పరిధి ముడసర్లోవలో సుమారు 680 ఎకరాలు జీవీఎంసీకి చెందిన భూమి ఉంది. దీన్ని ముడసర్లోవ వాటర్ కేచ్‌మెంట్ ఏరియాగా గుర్తించారు. దీనిలో ఎలాంటి నిర్మాణాలు జరపకూడదు. పైనాపిల్ కాలనీ, ధారపాలెం, ఎస్ఎస్ఎన్ నగర్, రామకృష్ణాపురం గ్రామాలు దీని మధ్యలో ఉన్నాయి. దీంతో పాటు రైల్వే, పోర్టు విభాగాలకు గతంలో నష్టపరిహారం కింద ప్రభుత్వం ఇక్కడ కొన్ని ఎకరాల భూమిని కేటాయించింది. మిగిలిన సుమారు 600 ఎకరాల వరకు జీవీఎంసీకి చెందిన భూమి ప్రస్తుతం ఉంది. ఇందులోనే ముడసర్లోవ రిజర్వాయర్‌ను ఆనుకుని దాని వెనుక సుమారు 200 ఎకరాలు భూములున్నాయి. వాటికి జీవీఎంసీ అధికారులు ఎనిమిది నెలల క్రితం రూ. 9.90 కోట్ల నిధులు కేటాయించి రక్షణ గోడ నిర్మించారు. ఈ గోడ నిర్మించడంతో ఇక్కడ భూములకు రక్షణ కవచం ఏర్పడింది. ఇక్కడి రోడ్లకు, పరిసరాలకు అందం చేకూరింది.

ముడసర్లోవ రిజర్వాయరు చుట్టూ..

రక్షణ కవచంలో భాగంగా సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ముడసర్లోవ రిజర్వాయర్ చుట్టూ గోడ నిర్మించారు. దీంతో లోపలికి గేదెల ప్రవేశానికి అడ్డుకట్ట పడింది. గతంలో బహిరంగంగా ఉండటంతో ఈ ప్రాంతంలో మేతకు వెళ్లిన గేదెలు ఈ రిజర్వాయర్‌లోకి దిగి నీటిని అపరిశుభ్రం చేసేవి. కొన్నిసార్లు నీరు, బురదలో కూరుకుపోయి మృత్యువాత పడేవి. ఇప్పుడు ఆ పరిస్థితికి బ్రేక్ పడింది.

అందంగా పరిసరాలు..



ముడసర్లోవలో ఎకరాల కొద్దీ జీవీఎంసీ భూములున్నాయి. వీటిని కొన్ని చోట్ల కొందరు ఆక్రమణ చేస్తున్నారు. ఇప్పుడు అధికారులు గోడ నిర్మించారు. దీనివల్ల భూముల ఆక్రమణకు అడ్డుకట్ట పడింది. రోడ్లు, పరిసరాలు అందంగా రూపుదిద్దుకున్నాయి.

– కె.చిరంజీవి, ఆరిలోవ కాలనీ

అధికారుల పనితీరు అభినందనీయం



ప్రభుత్వ ఆస్తిని అధికారులు కాపాడారు. ఆక్రమణకు గురి కాకుండా రక్షణ గోడలు నిర్మించారు. గతంలో ఏ అధికారులూ దీని గురించి ఆలోచించలేదు. ఇప్పుడు ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు జీవీఎంసీ భూములకు రక్షణ గోడ నిర్మించడం అభినందనీయం.

– మోహన్‌రెడ్డి, సింహగిరికాలనీ

నేటి నుంచి మార్గశిర పూజలు

ఆరిలోవ ఎస్‌కేఎంఎల్ నగర్‌లోని కనకమహాలక్ష్మి ఆలయంలో ఏర్పాట్లు



కనకమహాలక్ష్మి అమ్మవారు

ఆరిలోవ: మార్గశిర మాసం బుధవారం నుంచి ప్రారంభం కానుండటంతో ఆరిలోవ ప్రాంతం ఎస్‌కేఎంఎల్ నగర్‌లోని కనకమహాలక్ష్మి ఆలయం ముస్తాబవుతోంది. ఈ ప్రాంతంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం ఇదొక్కటే కావడంతో ప్రతీ సంవత్సరం మార్గశిర మాసంలో అమ్మవారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ నిర్వాహకులు చర్యలు చేపడుతున్నారు.

జనవరి 11 వరకు .. : ఈ నెల 13 నుంచి జనవరి 11 వరకు నిత్య పూజలు, ప్రతీ గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రోజూ సుప్రభాత సేవతో ప్రారంభమై పంచామృతాభిషేకం, సర్వదర్శనం, కుంకుమ పూజలు చేయనున్నట్లు చెప్పారు. నాలుగో గురువారం మధ్యాహ్నం ఆలయ ఆవరణలో మహా అన్నదానం, ఐదో గురువారం సాయంత్రం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటితో పాటు నాలుగు శుక్రవారాలలో ఉదయం 10 గంటల నుంచి అమవారికి విశిష్ట పూజలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన



నీళ్ల కుండీలు పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మి

ఏయూక్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో పారిశుధ్య పనుల నిర్వహణను కార్పొరేటర్ ముప్పల లక్ష్మి మంగళవారం పరిశీలించారు. ఉదయం వార్డులో పర్యటించి ఇంటింటా వాహనాల ద్వారా చెత్త సేకరణ, కాల్వలు శుభ్రం చేస్తున్న విధానం, రహదారులు శుభ్రం చేస్తున్న సిబ్బంది పనితీరు పరిశీలించారు. శివాజీపాలెం ప్రాంతంలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పలువురి ఇళ్ల వద్ద కుండీల్లో నిల్వ నీటిని పరిశీలించి, మలేరియా సిబ్బంది మందులు వేస్తున్నారా అని ఆరా తీశారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించాలని సూచించారు. పారిశుధ్య సిబ్బంది ఎంతో జాగ్రత్తగా పనిచేయాలని.. రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పర్యటనలో కన్వీనర్లు హేమలత, ఆచారి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమత కళాశాలలో భాషా తరంగ్

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో భాషా తరంగ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాలలో డిగ్రీ చదివే విద్యార్థులకు భాష అవశ్యకతను, ఉపయోగాలను తెలిజెప్పే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కళాశాల డీన్ విజయ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో గాయత్రి కళాశాల లెక్చరర్ డాక్టర్ సాయిబాల మాట్లాడుతూ హిందీని రాజభాషగా, సంస్కృతాన్ని దేవభాషగా, తెలుగును మాతృభాషగా అభివర్ణించారు. విద్యార్థులు అన్ని భాషలపై పట్టు పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అలరించిన నాటక ప్రదర్శనలు



బాంబే టైలర్స్ నాటకంలో సన్నివేశం

మద్దిలపాలెం: రసజ్ఞ జాతీయ భాషా నాటకోత్సవాలు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గారడీ, బాంబే టైలర్స్ నాటకాలు అలరించాయి. ప్రతీ సన్నివేశం ఆసక్తికరంగా సాగి, ఆహూతులను ఆకట్టుకుంది.

పోలమాంబ ఆలయంలో చండీ హోమం

ఏయూక్యాంపస్: స్థానిక పోలమాంబ ఆలయంలో మంగళవారం చండీ హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు స్వయంగా హోమం నిర్వహించారు. శ్రీచక్రార్చన జరిపారు. ఆలయ ఈవో కె.గాయత్రి మాట్లాడుతూ దేవస్థానంలో ప్రతీ నెలా పౌర్ణమి, అమావాస్య రోజుల్లో చండీ హోమాలు నిర్వహిస్తున్నామని, భక్తులు స్వయంగా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు.

రాస పోలమాంబకు ప్రత్యేక అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామ దేవత రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం రూపాయి కాసులతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ అలంకరణకు పంచాయతీకి చెందిన కాగితాల గోవింద, రాజేష్‌రెడ్డి, వెంకట రమణ, అప్పల సత్యం, నారాయణ, మజ్జి సురేష్, సాయి, చిల్ల గణేష్ సహకారం అందించారు.

ఎయిడ్స్ రోగులకు పథకాలు వర్తింపజేయాలి

సీనియర్ జడ్జి ఎంవీ శేషమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ జడ్జి శేషమ్మ



హాజరైన వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట : హెచ్‌ఐవీ/ఎయిడ్స్ రోగులకు చట్ట పరిధిలోని అన్ని పథకాలు అందజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ జడ్జి ఎంవీ శేషమ్మ అన్నారు. మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ రోగులకు అందజేసే పథకాలపై అవగాహన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ రోగులకు రేషన్ కార్డులు, పెన్షన్ ఇవ్వాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ఎయిడ్స్ రోగులకు ప్రభుత్వం ఇచ్చే అన్ని పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ఎవరికైనా అమలు కాకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే అన్ని యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల్లో కూడా ఏఆర్‌టీ ట్రీట్‌మెంట్, మందులు తప్పకుండా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో సూర్యప్రకాశరావు, చైల్డ్ కేర్ కమిటీ పర్సన్ ఎంఆర్‌ఎల్ రాధ, ఆర్‌వీఎస్ఎన్ మూర్తి (పోలీసు), శ్రీలత (ఐసీడీఎస్), నోడల్ అధికారి ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి బి.నాగేశ్వరరావు, బాబీ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామా.. సీఎం జగన్ పాలన



మాట్లాడుతున్న 17వ వార్డు కార్పొరేటర్ లావణ్య

ఎంవీపీకాలనీ: రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి చిరునామాగా సీఎం జగన్ పాలన నిలుస్తుందని 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య అన్నారు. ఎంవీపీ కాలనీ పరిధిలోని 17వ వార్డు నేతాజీ పార్కులో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని మంగళవారం ఆమె ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్ నాయకత్వం రాష్ట్రానికి ఎందుకు కావాలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల ఆర్థికాభివృద్ధి కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రజలను ప్రతీ కష్టంలోను ఆదుకుంటూ వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య

15వ వార్డులో వై ఏపీ నీడ్స్ జగన్

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు సచివాలయం పరిధిలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పాల్గొన్ని వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. పేదల అభ్యున్నతికి ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, సత్తిబాబు, గొలగాని త్రినాథరావు, బుగత ఏసురత్నం, బొడ్డేడ అచ్యుత తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహను తట్టిలేపే 'బండి' కవిత్వం



బండి సత్యనారాయణను సన్మానిస్తున్న అతిథులు

మహారాణిపేట : సామాజిక స్పృహను తట్టి లేపే కవితలు రాయడం బండి సత్యనారాయణకే దక్కిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అరసం విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ప్రాంగణంలో రచయిత బండి సత్యనారాయణకు గెద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ 13వ రాధిక సాహితీ అవార్డును ప్రముఖ రచయిత గెద్దాడ కస్తూరి ప్రసాద్ బహూకరించి సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బండి రచనలు సమాజంలోని ఇతివృత్తాలను ప్రతిబింబిస్తూ పాఠకుల్లో ఆలోచనలు రేకెత్తించే విధంగా ఉంటాయన్నారు. ప్రకృతి ఒడిలో మమేకమై బండి రచనలు చేసేవారని కొనియాడారు. బండి సత్యనారాయణ రచించిన కవితలు చదివి వినిపించారు. కార్యక్రమంలో అరసం జిల్లా కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఉపాధ్యక్షుడు ఎస్.హనుమంతరావు, సీతారత్నం, ఆకాశవాణి డీడీజే (ఇ) సి. సుబ్బారావు, డాక్టర్ మాటూరి శ్రీనివాస్, స్వర్ణ శైలజ, పావని, బుక్ హౌస్ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులు

భీమునిపట్నం: ఇటీవల విశాఖలో డీసెంట్ ఫోటోకాన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో భీమిలికి చెందిన షాడో వారియర్స్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లోని కాటా, కుమిటీల్లో పాల్గొన్నారు. ఎస్.అభినవ్, పి.బెన్సన్, కోటి, శివ, గణేష్, జశ్వంత్, సుశాంక్, వరుణ్‌కుమార్, నిక్షిత, చంద్రకౌశిక్, శివరాం, తేజశ్విన్ సాయి, సాయిచరణ్ తదితరులు బంగారు, వెండి పతకాలతోపాటు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఈ మేరకు మంగళవారం ఇక్కడి అసోసియేషన్ చీఫ్ కోచ్ ముగడ వెంకట రమణ యాదవ్, ఇతర సభ్యులు విద్యార్థులను అభినందించారు.

జ్యోతిర్లింగ స్వరూపుడిగా పార్వతీ ముక్తేశ్వరుడు



కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఎంవీపీ కాలనీ : కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో శ్రీ సిద్ధి వినాయక పార్వతీ ముక్తేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిర్లింగ స్వరూపుడిగా పార్వతీ ముక్తేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో కార్తీక దీపాలు వెలిగించారు. మహా శివలింగం ఆకారంలో ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ ప్రతినిధి బుచ్చిలింగం, సత్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేణుక యల్లమ్మ దేవాలయంలో మహారుద్రాభిషేకం



కోటి ఒత్తుల దీపాన్ని వెలిగిస్తున్న ముఖ్య అతిథులు

అల్లిపురం : కార్తీక మాసం ఆఖరి రోజు అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద మహారుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయ కార్యవర్గం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త పీల వెంకట అప్పలనాయుడు, యల్లమ్మ ఆలయం అధ్యక్షుడు కర్రి నీలకంఠం ఆధ్వర్యంలో మృత్తిక లింగ అభిషేకం కనుల పండువగా నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, ఫలరసాలతో శివ నామస్మరణ మధ్య మహాదేవునికి విశిష్ట అభిషేకం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వెంకట రమణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ద్రోణంరాజు శ్రీవత్సవ్, లింగం శ్రీనివాసరావు, ఆలయ కార్యవర్గ సభ్యులు బొడ్డు పోలారావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తోడపెద్దు సేవ, గరిడీ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమం అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు.

కైలాసగిరీశ్వర ఆలయంలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ దంపతులు

ఆరిలోవ : కార్తీక మాసం ముగియనున్న సందర్భంగా జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల ఆధ్వర్యంలో కైలాస గిరీశ్వరాలయంలో అన్న సంతర్పణ నిర్వహించారు. కార్తీక వన భోజన సమారాధన పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎస్పీ కె.వి. మురళీకృష్ణ దంపతులు ఆలయంలో స్వామి వారిని దర్శించుకుని శివుడికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం జరిగిన వన భోజన సమారాధనలో ఎస్పీ దంపతులు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో విశాలాక్షినగర్, జోడుగుళ్లపాలెం, రెవెన్యూ కాలనీ, హనుమంతవాక ప్రజలు, ఏఆర్ పోలీస్ కుటుంబాలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదం స్వీకరించాయి. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, వైఎస్సార్ జిల్లా అదనపు ఎస్పీ ఎ.ఆర్. సత్తిరాజు, రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, అరవింద్ కిశోర్, ఆర్.ఎస్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాలభైరవస్వామికి ప్రత్యేక పూజలు



కాలభైరవస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



గౌరీ జ్ఞానలింగేశ్వర స్వామి సన్నిధిలో దీపాలంకరణ

మద్దిలపాలెం : కార్తీక మాసం అమావాస్యను పురస్కరించుకుని కొత్త వెంకోజీపాలెం శ్రీ గౌరీ జ్ఞాన లింగేశ్వరస్వామి ఆలయంలో గల కాలభైరవ స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు సూర్యప్రకాష్‌శర్మ భక్తుల పేరిట అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ, కాండ్రేగుల నూకేశ్వరరావు, బోరా రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీగౌరీ జ్ఞాన లింగేశ్వర ఆలయంలో దీపాలంకరణ..

కొత్త వెంకోజీపాలెంలో గల జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం దీపాలంకరణ చేశారు. శివలింగాకృతిలో ప్రమిదలు వెలిగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సేవా సంఘం అధ్యక్షుడు పీలా రమణ, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల నూకేశ్వరరావు, ఆలయ అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన జాతీయ సదస్సు



ముగింపు సదస్సులో పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్ : సెయింట్ జోసెఫ్ కళాశాల జువాలజీ విభాగం ఆధ్వర్యంలో జలవనరుల పరిరక్షణ వ్యూహాలు–సుస్థిరతపై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారంతో ముగిసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ తెలిపారు. ఫిషరీస్ నుంచి విచ్చేసిన పలువురు శాస్త్రవేత్తలు ప్రసంగాలు చేసినట్టు సదస్సు కన్వీనర్ డాక్టర్ ఇ. హరిణి పేర్కొన్నారు. సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో సీఎంఎఫ్ఆర్ఐ ప్రిన్సిపాల్, సైంటిస్ట్ డాక్టర్ జో కిజాకుడన్ పాల్గొని జలవనరుల పరిరక్షణ అంశం వర్తమానంలో అత్యంత కీలకమని పేర్కొంటూ సదస్సు నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జలవనరుల పరిరక్షణ వ్యూహాలపై విద్యార్థులు ప్రదర్శించిన పోస్టర్లు వినూత్నంగా ఉన్నాయన్నారు. అనంతరం జాతీయ సదస్సులో పాల్గొన్న వారికి జ్ఞాపికలు, ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల జువాలజీ అధ్యాపకులు డాక్టర్ రోజీనా, డాక్టర్ స్నేహ, పలు కళాశాలల ఫ్యాకల్టీ, రీసెర్చి స్కాలర్లు, సైంటిస్టులు, పారిశ్రామికవేత్తలు, డాక్టర్ పి.కె. జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో పతకాలు

కొమ్మాది: ఇటీవల డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కాపులుప్పాడకు చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. అండర్ – 18 విభాగంలో ఇ.లిఖిత రజిత పతకం, అండర్ – 26 విభాగంలో శ్రీ ఇషిత బంగారు పతకం, అండర్ – 14 విభాగంలో శ్రీ విశాగ్ బంగారు పతకం సాధించినట్లు కాపులుప్పాడ న్యూ ఇండియా తైక్వాండో క్లబ్ నిర్వాహకులు యశోదరావు తెలిపారు. అదే విధంగా కాకినాడ జిల్లా సామర్లకోటలో విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో బీచ్‌రోడ్డు మంగమారిపేటకు చెందిన వాసుపల్లి నివేదిత 7 సంవత్సరాల విభాగంలో బంగారు పతకం, పదేళ్ల విభాగంలో కారి రేష్మి బంగారు పతకం సాధించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ఆనందపురం : మానవాళి మేలు కోరి ఏసు క్రీస్తు చేసిన బోధనలు అనుసరణీయమని పలువురు మత బోధకులు చెప్పారు.వేములవలసలో సోమవారం రాత్రి ఐక్య క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజానికి మంచిని బోధించడం క్రీస్తు జననం ముఖ్య ఉద్దేశమని వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆహూతులను అలరించాయి. గెయిల్ ఇండియా సంస్థ చీఫ్ మేనేజరు సంజీవిరావు తదితరులు పాల్గొన్నారు.